హే బిడ్డా... ఇది మా అడ్డా...

- పశువుల సంచారంతో రహదారుల నిర్బంధం
- రాత్రి సమయాల్లో రోడ్లపైనే నిద్రిస్తున్న ఆవులు, గేదెలు
- ప్రయాణికులకు ప్రమాదాలు



కాకినాడ - కోటిపల్లి రహదారిపై పెట్రోల్ బంకు సెంటర్ వద్ద రాత్రి రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

కాజులూరు: ఒకటి కాదు.. రెండు కాదు.. పదుల సంఖ్యలో పశువులు నిత్యం రోడ్లపైనే సంచరిస్తున్నాయి. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా విశాలంగా ఉండే రహదారులను ఆక్రమించుకుని నడిరోడ్డుపైనే మకాం పెట్టేస్తుండటంతో వాహనచోదకులు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు. ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన బహిరంగ పశువుల సంచారం నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. నియోజకవర్గంలో ప్రధాన గ్రామాలతో పాటు పలు చిన్న, చిన్న పల్లెల్లోనూ గేదెలు, ఆవులను మేపుకునే కొందరు స్థానికులు పాలు తీసుకుని వాటిని గ్రామంలో వదిలేస్తున్నారు. రాత్రి సమయాల్లో అవి రోడ్లపై సంచరిస్తూ రహదారి మధ్యలో పడుకుని నిద్రిస్తున్నాయి. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు ఈ పశువులను ఢీకొని తీవ్ర గాయాలపాలవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాటిలో అవే పోట్లాడుకుని ప్రయాణికులపైకి దూసుకొస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ, కోటిపల్లి రహదారిపై కాజులూరు మండలం గొల్లపాలెం వద్ద రోడ్డుపై పశువుల సంచారం ప్రయాణికులకు తీవ్ర ప్రమాదకరంగా మారింది. ఆర్యావటం దొరగారి మలుపు నుంచి గొల్లపాలెం ధనమ్మతల్లి ఆలయం మధ్యలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. వాహనాలు పశువులను ఢీకొని ఎందరో క్షతగాత్రులవుతుండగా కొన్ని సందర్భాల్లో పశువులు తీవ్ర గాయాలపాలై మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ఆర్యావటంలో ఆవుదూడను ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ దూడ తీవ్ర గాయాలపావగా గొల్లపాలెంలో ఒక చూడి ఆవు మృత్యువాత పడింది. గతంలో పట్టణాల్లో పశుగ్రాసం కొరత కారణంగా బహిరంగ పశువుల సంచారం ఉండేది. అయితే పచ్చని పచ్చిక బయళ్లలో కళకళలాడే గ్రామాల్లోనూ కొందరు స్వార్థపరులు ఇలా ఆవులను కొని వాటి పాలు తీసుకుంటూ వాటిని గాలికి వదిలివేస్తుండటంతో అవి రోడ్లపై సంచరిస్తూ ప్రయాణికులు, స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రహదారులపై పశువుల సంచారంపై గ్రామ పంచాయతీ అధికారులకు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆవుల యజమానులు వాటిని కట్టడి చెసేలా హెచ్చరికలు జారీ చేయాలని అప్పటికీ వినని పక్షంలో వాటిని పట్టి గోశాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రహదారులపై పశువుల సంచారం వల్ల తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలి.

– పెంకే సత్యనారాయణ, ప్రయాణికుడు, కాజులూరు

గోశాలకు తరలించాలి



రోడ్లపై పశువుల బహిరంగ సంచారంపై పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల ఆదేశాలను పశువుల యజమానులు బేఖాతరు చేస్తున్న తరుణంలో వాటిని పట్టి గుర్తింపు పొందిన గోశాలకు తరలించాలి.

– గెద్దం కన్నంరాజు, ప్రయాణికుడు, గొల్లపాలెం

రేపటి నుంచి సాయి నవరాత్ర వేడుకలు

కాజులూరు: మండల గ్రామాల్లో ఆదివారం నుంచి సాయి నవరాత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా విజయదశమి మొదలుకొని బాబావారి ఆలయాల్లో భక్తులు నవరాత్ర వేడుకలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 13వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమవనున్న సాయి నవరాత్ర వేడుకలు 21వ తేదీ సోమవారం వరకు కొనసాగనున్నాయి. నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బాబావారి ఆలయాలకు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యలో పంచామృత అభిషేకం, విష్ణు సహస్ర సామూహిక పారాయణ, అష్టోత్తర విభూది పూజలు నిర్వహించనున్నారు. రాత్రి సమయాల్లో భక్తులు జ్యోతులను చేతపట్టుకుని సాయినామ కీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద తొమ్మిది రోజులు రోజుకో కార్యక్రమం చొప్పున జ్యోతిర్లింగార్చన, గోమాత పూజ, హరికథ, బుర్రకథ వంటి కచేరి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మండలంలోని కాజులూరు, ఆర్యావటం, చేదువాడ, గొల్లపాలెం, శీల, దుగ్గుదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, పెనుమళ్ల, అయితపూడి, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో బాబావారి నవరాత్ర ఉత్సవాలు జరగనున్నాయి. నవరాత్రులు తొమ్మిది రోజులు ఆర్యావటంలోని బాబవారి ఆలయంవద్ద నిత్యాన్న దాన సమారాధనకు నిర్వాహక కమిటీ సభ్యులు సిద్ధమౌతుండగా పలు గ్రామాల్లో నవరాత్ర మహోత్సవాల అనంతరం ఆలయాల వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

అంగరలో 48 మందికి కంటి పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి సత్యనారాయణ

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పీహెచ్‌సీ నూతన బ్లాక్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.సత్యనారాయణ 48 మంది రోగుల కళ్లను పరీక్షించారు. నలుగురికి కాటరాక్ట్ శస్త్ర చికిత్స చేయాల్సి ఉన్నట్టు గుర్తించారు. 18 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ణయించారు. శిబిరాన్ని వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి పర్యవేక్షించారు. శిబిరంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, సిబ్బంది దుర్గ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు స్వామి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. వేకువజాము 3 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేస్తారని ఆ సమయంలో భక్తులకు దర్శనభాగ్యం కలిపిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

మండపేట: గ్రామీణ ఉపాధి హామీ పనులను ఈ ఏడాది పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల పేరిట నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ పనులకు ఈ నెల 14న భూమిపూజ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పనులను పూర్తి చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మండలంలోని మారేడుబాకలో 14వ తేదీ ఉదయం 9 గంటలకు, తాపేశ్వరంలో 10 గంటలకు, ఇప్పనపాడులో 10:30 గంటలకు, జెడ్.మేడపాడులో 11 గంటలకు ఈ ఉపాధి పనులకు భూమిపూజ చేస్తారన్నారు. ద్వారపూడిలో ఉదయం 11:30 గంటలకు మొదలుపెడతామన్నారు. ఇందుకు అనుగుణంగా ఆయ పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

పంచాయతీ వార్డు సభ్యుడు గంగాధరం మృతి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పంచాయతీ ఒకటో వార్డు సభ్యులు శివుడు గంగాధరం గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, నాయకులు పిల్లా బసవరాజు, దానేటి శరత్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

రామచంద్రపురం: రామచంద్రపురం మున్సిపాలిటీలో అధికార పక్షంగా ఉన్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తాము పార్టీ మారే ప్రసక్తి లేదని తమ ప్రయాణం వైఎస్సార్ సీపీతోనే అని స్పష్టం చేశారు. ఇటీవల వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అధికార కూటమి పార్టీల వైపు చూస్తున్నారని తప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రామచంద్రపురం మున్సిపల్ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ నేతృత్వంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అచంచలమైన విశ్వాసం తమకు ఉందని వారు తెలిపారు. కూటమి పార్టీ నేతలను ఇప్పటికే ప్రజలు తిరస్కరిస్తున్నారని, మభ్యపెట్టే దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చుకోలేక తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని వివాదం చేసిన తీరును ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. అదే విధంగా ప్రజల దృష్టిని తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి మరలించడానికే వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు తమ పార్టీల్లోకి వస్తున్నారని తప్పుడు ప్రచారం తెరమీదికి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్, ఎంపీ బోస్‌లకు అండగా ఉంటూ పార్టీ కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ బోస్, పార్టీ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్‌లతోనే మా ప్రయాణం అంటున్న కౌన్సిలర్లు

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



రామచంద్రపురంలో హోరాహోరీగా తలపడుతున్న బాస్కెట్‌బాల్ బాలికల జట్లు

రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలలో మొదటి రోజు లీగ్ పోటీలు నిర్వహించారు. బాలుర జట్లు 10, బాలిక జట్లు 9 పాల్గొన్నాయి. మొదటి లీగ్ పోటీలలో 16 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో 8 జట్లు నాక్ అవుట్ పోటీలకు అర్హత సాధించాయి. నేడు, రేపు నాక్ అవుట్ కం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు జరుగుతాయని ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు చెంగల రాయుడు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



శాకంబరి దేవిగా వెల్ల బాలాత్రిపురసుందరీ అమ్మవారు



మహిషాసురమర్దినీ దేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



మహిషాసురమర్దినీ దేవి అవతారంలో ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



మండపేటలోని ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి



మహిషాసురమర్దిని అవతారంలో కొత్తూరు రోడ్డులోని కనకదుర్గమ్మ వారు

మహిషాసురమర్దిని నమోస్తుతే..

- ద్రాక్షారామ మాణిక్యాంబకు విశేష పూజలు
- అంబరాన్నంటిన దసరా సంబరాలు



సోమేశ్వరంలో సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తి పీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు మహిషాసురమర్దినిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో మహిషాసురమర్దిని దేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్‌కుమార్, త్రిపురమల్లు గోపాల్ పూజల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

వెల్లలో..

మండలంలోని వెల్లలో వేంచేసిన సోమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో దుర్గాష్టమి పురస్కరించుకుని శుక్రవారం బాలాత్రిపుర సుందరి అమ్మవారిని శాకంబరిగా అలంకరించి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ ఎంవీవీ సత్యానారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: దేవీశరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కొత్తూరు రోడ్డులో వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెరుకుపల్లి గణేష్‌శర్మ నేతృత్వంలో అర్చక బృందం అమ్మవారికి మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం కావడంతో మహిళలు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఆలయ కమిటీ నేతృత్వంలో భక్తులకు అన్ని ఏర్పాట్లను చేశారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లోని పలు దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గొల్లపాలెం కొత్తపేట దుర్గాదేవి ఆలయంలో అమ్మవాని స్థానిక భక్తులు 200 కేజీల 24 రకాల కూరగాయలతో అలంకరించారు. శాకంబరీదేవి రూపంలో ఉన్న అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం (పండుస్వామి) ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలుగా పసుపు, కుంకుమ పంచారు. ఈ ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్ర మహోత్సవాల్లో చివరి శుక్రవారం రోజున అమ్మవారిని కూరగాయలతో అలంకరించి శాకంబరీదేవి రూపంలో పూజలు నిర్వహించటం పరిపాటిగా జరుగుతుందన్నారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు.



మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చిన సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

విజయానికి సూచికగా విజయ దశమి

రాయవరం: చెడుపై మంచి విజయం సాధిస్తుందని విజయదశమి పర్వదినం లోకానికి చాటి చెబుతుందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆయన పీఠానికి హాజరైన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేశారు. విజయదుర్గ అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దిని రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మండలంలోని మాచవరంలో దేవీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు.దేవీ సెంటర్లోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన దేవీ వ్రతంలో మాచవరం పరిసర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గాష్టమి కావడంతో పలు ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శివాలయమైన సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వెంటూరులోని ఉమా సోమేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వర స్వామి, పసలపూడిలోని పార్వతీ సమేత రాజేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అంగరలోని మధ్యాహ్నపు అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మండపేట: దుర్గాదేవి శుక్రవారం మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ఏడిద, సీతానగరం, తాపేశ్వరం, ఇప్పనపాడు, కేశవరం, ద్వారపూడి, వెలగతోడు, పాలతోడు, మారేడుబాక, అర్తమూరు గ్రామాల్లోని అమ్మవార్లు విశేష పూజలు అందుకున్నారు. శనివారం దసరా పండుగ సందర్భంగా అమ్మవారికి సెమీ పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. ఏడిద రోడ్డులో కొలువైన పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దమ్మ తల్లిని దర్శించుకోవడానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయం వద్ద శనివారం భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామని పెద్దమ్మ తల్లి ఆలయ వ్యవస్థాపకుడు వాలిన వీరబాబు తెలిపారు. ఏడిద, ఏడిద కొత్తూరు, మండపేట ప్రజలు విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వీరబాబు విజ్ఞప్తి చేశారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శుక్రవారం శరన్నవరాత్ర ఉత్సవ శిబిరాలు సందడిగా మారాయి. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఉత్సవ శిబిరాల్లోని అమ్మవారి ప్రతిమలను విశేషంగా అలంకరించారు. అంగరలోని మధ్యాహ్నపు అమ్మవారి ఆలయంలో అర్చకులు వారణాసి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. వీధివారిలంక, నాగులచెరువు, నిడసనమెట్ట, టేకి, కోరుమిల్లి, కాలేరు, అచ్యుతాపురం, నల్లూరు, వెదురుమూడి తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.